# రాచకొండ విశ్వనాథశాస్త్రి తో



**రావిశాస్త్రి:** (కంగారుగా) కోర్టుకి వేళయిపోతూంది. క్లయింట్లు 'అలోచాత్రిబాబూ' అనుకుంటూ ఎదురుచూస్తూంటారు. ఇంకా వన్‌టౌన్ పోలీసు స్టేషనుకు వెళ్ళాలి. యూనివర్శిటీలో తుమ్మల వేణుగోపాల రావుగారింటికెళ్ళాలి. మాచెల్లెలి దగ్గరకెళ్ళి ఇంజెక్షన్ తీసుకోవాలి. ఇంకా స్నానమూ లేదు ఏ గుడ్డూలేదు.

**మధురవాణి:** (నవ్వుతూ) శాస్త్రిగారూ మీరింకా విశాఖపట్నంలో వున్నామనుకొంటున్నారు. ఇది ఆ భూలోకం కాదు. మీరు ఆ భౌతిక దేహాన్ని విసర్జించారు (నేపథ్యంలోంచి అబ్బూరి వరదరాజేశ్వరరావు గొంతుకలో పద్యాలు వినిపిస్తాయి.)

''అల విశాఖ పురసాగరంబు తప్త
సైకతమ్ముల బహుదిన సాంధ్యవే
కలువరింతల మనసారకట్టుకొన్న
గాలి మేడలే మనకు దిక్కయ్యెనేడు''

**మధుర:** వింటున్నారా ఈనాడు మన తెలుగు దేశం ఎలా వుందంటే-

''స్వీయకృతి నొకదాని చే ధరించి
పదవులకయి నానా మంత్రిపదములంటు
పద్యకర్తలు సాహిత్యవర్తకులును
వేనవేలు త్రిలింగదేశాన నేడు!''

**రావి:** వ్యవస్థకి కొమ్ముకాసే రావప్పంతుల్లెప్పుడూ వుంటారు. ఇప్పుడు మనం విశాఖపట్నంలో లేమా?

**మధుర:** మీరు స్వర్గానికి వెళ్ళనంటే సరే కదాని యిక్కడకు తీసుకొచ్చాను.యింకా వరద ఎమంటున్నారో విన్నండి.

''ఆశలే చివురించని శైశవాన
అక్షరాభ్యాస బాధా మహాబ్ధిలోన
కాలిడిన యంత నీవె నా కంటబడితి
వా విశాఖ నగరవీధులందు మొదల!
నన్నుజూచిన యంత నీ కన్నులెంత
విరిసిపోయినవో నాడు విదితమయ్యె
లోన నీలోని నిద్రాణి వాణి నీకు
తెలియరాక మేల్కొని నన్ను పలుకరించె!''

**రావి:** నామీద పద్యాలు చదువుతున్నాడు రాజేశ్వరరావు కాబోలు. అన్నట్టు వాడు కూడా వచ్చాడు కదూ, నాకన్నా ముందు యిక్కడకు !

**మధుర:** రాజేశ్వరరావు గారు మీ చిన్ననాటి నేస్తమూ లీడరూ కదా!... రండి రండి వరద గారూ. మీ శిష్యులు రావిశాస్త్రిగారు మీకోసం కలవరిస్తున్నారు...

**రాజేశ్వరరావు:**

నాడు నీ వెరుంగవు విశ్వనాథశాస్త్రి
నేనెరుంగుదు నీ వర్థమాన పథము
తెలుగు సాహితీ జగతి ప్రదీప్తమవును
నీవలన ముందు కాలాన నీకలాన!

**రావి:** నన్నేదో గొప్పచేస్తూ మీరు మాట్లాడటం రాయడం చేస్తారుగాని, నేను పెద్దగా చేసిందేమీలేదు. ఇంట్లో పడికొట్టుకొంటూన్న కథని బయటకు తీసుకొచ్చేననుకొంటున్నాను. సెక్సులోను, సంసారంలోను పడికొట్టుకొంటున్న కథకి కొత్త ఒరవడి పెట్టానని నమ్ముతున్నాను.

**వరద:**

ఏ జన్మాంతర బాంధవమ్మొ నవసాహిత్య ప్రపంచమ్మునన్
తేజోమూర్తులమై చరించితిమి, అంతేచాలు, ఈలోన నా
యీ జీవప్రద గాథలందు భవదీయేచ్ఛా కృతిన్ నిల్పితిన్
రోజుల్మారిన కాలమందు కవి మిత్రుల్ నిన్ను శ్లాఘింపగన్ ... (నిష్క్రమణ)

**మధుర:** అదిసరే, మీరు మరో మధురవాణిని సృష్టించారట నాకు పోటీగా, అహఁ నాకుకాదు, గురజాడ వారికి పోటీగా - (నవ్వుతుంది)

**రావి:** అదా. .? 'రత్తాలు - రాంబాబు'లో ప్రోలిటేరియన్ మధురవాణిగా 'ముత్యాలు' అని వుంది. ఈ ముత్యాలు పేదల మధురవాణి. గురజాడకి కృతజ్ఞతతోనే, పోటీ ఏంకాదు.

**మధుర:** చెడులో మంచి వుంటుంది. బురదలోంచి పద్మం పుట్టినట్లు కల్మషమైన జీవితంలోంచికూడా మంచి వాళ్ళు పుట్టుకొస్తూవుంటారు మీ గురించి మీ నోటే చెబితే వినాలనుంది. ఎప్పుడు ఎక్కడ పుట్టారోగదా!

**రావి:** నేను పుట్టింది మా మేనమావల యింట్లో ఆ ఇల్లు శ్రీకాకుళంలో వుంది. మా మేనమావల యింటిపేరు తెన్నేటి వారు. నేను పెరిగింది అనకాపల్లి దగ్గరున్న తుంపాలలో.

**మధుర:** మీ నాన్నగారేం చేసేవారు?

**రావి:** మా నాన్నగారు ప్లీడరుగా వుంటే అబద్ధాలు మాట్లాడవలసి వస్తోందని 1932లో ఆప్రాక్టీసు మానేసి తుంపాలలో వ్యవసాయం పెట్టేరు. ఎక్కువగా నేను తుంపాలకి నడిచి వెళ్ళేవాడిని.

**మధుర:** మీకు పుస్తకాలు చదివే అలవాటు ఎలా వచ్చింది?

**రావి:** చిన్నప్పుడు పుస్తకాలు చదివే అలవాటు మా అందరికీ మా అమ్మనుంచే వచ్చింది. మా అమ్మ చాలా పుస్తకాలు చదివింది సుమా. అంచేత నా చిన్నతనంలో శ్రీకృష్ణకర్ణామృతం, రఘువంశం చదవగలిగేను.

**మధుర:** మీ విద్యార్థి జీవితం ఎలా సాగింది?

**రావి:** నేను ఏ.వి.ఎన్. కాలేజి హైస్కూల్లో చదివినప్పుడు మామూలు విద్యార్థిని. మా తమ్ముడు బ్రిలియంట్. నేను సెకండ్ ఫామ్ తప్పేను గూడా. సైన్స్ సబ్జెక్టులు పట్టేవి కావు. కరెక్టు ఇంగ్లీషు రాయగలనే కాని మంచి ఇంగ్లీషు రాయలేను. సంస్కృతం చదివాను కాని అబ్బింది కాదు. ఇంటర్‌లో హిస్టరీ తీసుకుని చదివేను.

**మధుర:** మీరు ఫిలాసఫీ ఆనర్స్‌లో ఎలా చేరారు?

**రావి:** నేనో క్రాక్‌ననీ, సైకాలజీ చదివితే బాగుపడతాననీ మా నాన్న నన్ను ఫిలాసఫీ ఆనర్స్‌లో చేర్పించేరు.

**మధుర:** మీరు చిన్నప్పుడు ఏమైనా రాశారా?

**రావి:** 1935లో- అంటే నాకు పదమూడేళ్ళ వయసప్పుడు - గలివర్స్ ట్రావెల్స్ చదివేను. అప్పుడే నేను నవల రాయాలనుకొని మరుసటి రోజు మొదలు పెట్టేను. ఆ తర్వాత సెలవలు వచ్చినపుడు నవల పూర్తి చేసెయ్యాలనుకొనీకూడా, ఆతర్వాత సెలవల్లో అసలా నవల రాయడమే మానెయ్యాలనుకొని మానేసాను.

**మధుర:** రచనల్లో పాత్రల్ని సృష్టించడమేనా, లేక గంగరాజు హెడ్డులాగ మీకు చిత్రకళలో కూడా ప్రవేశం వుందా?

**రావి:** చిన్నప్పుడు గురుగోవిందసింగు, కూర్మావతారం, గుడ్డి బిచ్చగాడు, ఏనుగు, కృష్ణుడు మొదలైన బొమ్మలు వేశాను.

**మధుర:** చిన్నప్పుడే మీకు రాయాలని అనిపించిందన్నమాట.

**రావి:** దాన్ని రైటర్స్ ఇచ్ అంటారు. స్పెనిష్ గోల్డ్ లాటి పుస్తకాలు తెలుగులో రాయాలని చిన్నప్పుడు చూసేను. చిన్నతనంలో సరస్వతీపూజ కూడా చేసేవాణ్ని సుమా.

**మధుర:** మీరు కూడా చిన్నప్పుడు ఆర్థికంగా యిబ్బందులు పడ్డారా?

**రావి:** రెన్ అండ్ మార్టిన్ గ్రామరు పుస్తకం లేక కొన్నిసార్లు, నిక్కరు లేక కొన్నిసార్లు స్కూలు కెళ్ళడం మానీసేను., కత్తా-కలమా అన్న డిబేటులో చిన్నప్పుడు కలం పక్క వాదించేను.

**మధుర:** చిన్నప్పుడు మీకు కాస్త బుర్ర తిరుగుడు వుండేది అనుకుంటా.

**రావి:** (నవ్వి) చిన్నతనంలో నా పెంకెతనం ఎలా వుండేదంటే- ఇంట్లో వాళ్ళ మీదకోపం వచ్చినపుడు, వీళ్ళమీద పగతీర్చుకోకపోతే నా పేరు రాచకొండ విశ్వనాథశాస్త్రి కాదు అని తీవ్రంగా అనుకునేవాణ్ని, మా చెల్లెలు బుల్లిపాపను కొట్టేవాణ్ని. అప్పుడప్పుడు మా అమ్మని

కూడా బెదిరించేవాడ్నట! మరోసారి నా రక్తంతోటే నేను బొట్టుపెట్టుకుంటే చూసి అందరూ నవ్వేసరికిచెరిపేసేను. చిన్నప్పుడు తెలిసిన కుర్రాళ్లు కొంతమంది సూటూ హేటూ బనాయించి బజార్లో తిరుగుతూంటే చెడ్డ అసహ్యంవేసి - నేను పంచె, గాంధీ టోపీ వేసుకుని ఎందుకు తిరగకూడదనిపించి అలా తిరిగేను కొన్నాళ్ళు.

**మధుర:** చిన్నపుడు మీకేమైనా బహుమతులు వచ్చాయా చదువుల్లో...

**రావి:** 1938లో కాలేజీ వార్షికోత్సవంలో హిస్టరీలో వచ్చిన బహుమతి వేదిక మీదికి వెళ్ళి పుచ్చుకోవడం యిష్టం లేక, తరువాత మేస్టర్నడిగి పుచ్చుకున్నా.

**మధుర:** మీరు చిన్నప్పుడు గాంధేయవాదా? కాంగ్రెస్సా?

**రావి:** రాట్నం చేయించి, దారంతియ్యాలని కూడా అనుకుని, సోదరసమితిలోకెళ్ళి, దారంతీసేను. ఖాదీభాండారానికెళ్ళి రెండు చొక్కాలకి గుడ్డ కొనీసేను కూడా. నేను చిన్నపుడు గాంధీయిస్టునే అనుకునేవాడ్ని.

**మధుర:** మీకు చదువుమీద విరక్తి కలిగిందా ఎప్పుడైనా?

**రావి:** ఒకానొక క్లిష్టాతిక్లిష్ట కాలంలో, కష్టాతి కష్ట సమయంలో చదువుకోవాలనిపించలేదు. చదివితే డబ్బు ఖర్చు కూడా అనిపించింది. ఇలాగే వుండిపోయి పుస్తకాలు చదువుకుంటూ వుంటే తీరిపోదా అనిపించింది.

**మధుర:** మీ కుర్రతనంలో రచనావ్యాసంగం గురించి చెప్పేరుకారు?

**రావి:** 1935లో అంటే నా పదమూడో ఏట వేసవి శలవుల్లో రోజుకి అయిదు పేజీల చొప్పున ఒక డిటెక్టివ్ నవల రాయాలని ప్రతిజ్ఞ పట్టేను. తర్వాత ఆరంభించేను. ఆ తర్వాత రాసింది కొట్టేసి మరొకటి ఆరంభించేను.

**మధుర:** అసలు మీ మొదటి కథ ఎప్పుడు రాసేరు?

**రావి:** 1936లో మొట్ట మొదటి కథ తుంపాలలో మా యింట్లో పైన చిన్న గదిలో రాసేను. మా నాన్న మాకు అరటిపళ్ళు, ఏపిల్‌పళ్ళు, బత్తాయిపళ్ళతో పాటు వినోదిని, చిత్రగుప్త కూడా తెచ్చేవారు.

**మధుర:** మీకు ఎలాంటివి ఇష్టం?

**రావి:** 1937లో అనుకుంటా! 'అన్నపూర్ణ మందిరము' అన్నపుస్తకం చదివీసేను. చాలా బాగుంది. అందులో వర్ణనల్లాటివి నాకు చాలా యిష్టం.

**మధుర:** అప్పుడు మీరేవన్నా ఘనకార్యాలు చేశారా?

**రావి:** 1938లో అన్నాజీ, శాస్త్రి, నారాయణరావు, రాజేశ్వరరావు, మాధవరావు, భాస్కరరావు నేను కలిపి 'టింగురంగా' లాడ్జి ఒకటి పెట్టేం; కబుర్లు చెప్పు కొందుకి.

**మధుర:** ఇంకా చిన్నప్పుడు ఏమేం రాశారు?

**రావి:** 1937లోమిత్రుడు వెంకటేశ్వరరావు ఊరువెళ్ళాం. ఆ ఊళ్ళో వాళ్ళ స్కూలేదో

వుంటే అక్కడికెళ్ళి ఓ కథ సగం రాసేను. 'దేముడులేడూ' అని ఓ కథ రాసేను. అప్పుడే కొన్ని డిటెక్టివ్ కథలకి ప్లాట్లువేసి 'లాడ్జిలోకూనీ' అనే కథ చాలా వరకు రాసేను.

**మధుర:** ఏదైనా లైబ్రరీలో చేరేరా? ఎప్పుడు?

**రావి:** తుంపాలలో వున్నపుడు, అనకాపల్లి శారదా గ్రంథాలయంలో సభ్యుడిగా చేరి కొన్ని పుస్తకాలు చదివేను.

**మధుర:** మీ కథలు ఎవరేనా దిద్దేవారా?

**రావి:** నా తొలి కథలు సుబ్బారావు మేస్టరుగారి చేత దిద్దింపించేను. కథలు బాగానే వున్నాయనీసేరు కాని, శైలి ఒకచోట మామూలుగాను, మరొకచోట ఎక్కువగాను వుందనీ, మిస్‌లీడ్ అయిందనీ అన్నారు.

**మధుర:** ఏమన్నా అచ్చయాయా?

**రావి:** 1938లోనే ''శశాంకవిజయం'' అనే కథ రాసి ఎవరికో పంపించినట్లు గుర్తు. ఆ ఏడాదే ఆగష్టులో ''దేముడే చేశాడు'' అనే కథరాసి వినోదిని పత్రిక్కి పంపించేను. తిరుగు సమాధానం రాయమని అణా స్టాంపుకూడా పంపేను రాచకొండ విశ్వనాథశాస్త్రి పేరుతోనే ఆ కథ అచ్చయింది. నాకు తెలిసిన కొందరు అది నేను రాసేనంటే నమ్మలేదు మరికొందరు ఆశ్చర్యపడ్డారు. వెంటనే 'ప్రతిఫలం' అనే కథ వినోదినికే పంపించేను కాని వాళ్ళు వేసుకోలేదు. ఆ తర్వాత 'కామేశ్వరరావుగారికేసు' అనే డిటెక్టివ్ కథరాసి మళ్ళా వినోదినికే పంపేను

**మధుర:** మీరు సినిమాలు చూసి చలించేవారా?

**రావి:** 1938లోనే అనుకుంటాను; 'మాలపిల్ల' సినిమా వచ్చింది దీనిలో ఒక జాతిని తక్కువ చేసి చూపించడం నాకు యిష్టం లేకపోయేసరికి 'హిందూ' పత్రిక్కి ఉత్తరం రాసి పడేసేను.

**మధుర:** ఒక రచయిత హఠాత్తుగా ఆకాశంనుంచి వూడిపడడు మీరు ప్రసిద్ధులు అయి పేరు సంపాదించుకునే ముందు ఎంతో స్ట్రగుల్ అయివుంటారు.

**రావి:** ''పుట్టగానే మంచి కథలు రాసేను. రావడమే సాహిత్యరంగంలోకి శంఖు గదా చక్రాల్తో అవతరించేను-'' అని కొందరు ప్రగల్భాలు పలుకుతారు. నేనల్లాటివాడిని కాదు. 1939లో 'ప్రేమఫలితం' అనేకథ 'చిత్రగుప్త' కి పంపేను. ''మోడరన్ రత్నావళి'' అనేనాటకం రాయాలని చూసేను. ''కోనయ్య'' అనే నవల కూడా రాసేను. 1939లో ఇంటర్ ప్యాసైన వెంటనే ''పాతివ్రత్యం'' అనే కథరాసి పడేసేను. ఈ ఏడాది ఫిలాసఫీ ఆనర్సులో చేరిన తర్వాత ఓ కథరాసి తెనుగుతల్లి పత్రిక్కో, దేనికో పంపమని ఓ మిత్రుడి కోర్కెమీద యిచ్చేను.

**మధుర :** మీరేమన్నా సంఘాలు స్థాపించి పత్రికపెట్టడానికి చిన్నప్పుడు ప్రయత్నాలు చేసేరా?

**రావి:** యువభారతి అని ఓ సంఘాన్ని స్థాపించాం ' ఉష' అని పత్రికని ప్రారంభిద్దామని చూశాం!

**మధుర:** మీ కథ లేమన్నా పత్రికల్నించి తిరిగి వచ్చాయా?

**రావి:** ఒస్తే ఏం? శ్రీశ్రీ 'మరోప్రపంచం' గీతాన్నే భారతి తిరగ్గొట్టింది. ఆ రోజుల్లోనే 'వ్యామోహం' 'దౌర్భాగ్యం' (చెహోవ్ 'గ్రీఫ్') అనే కథలురాసేను. 'దౌర్భాగ్యం' కథ ఆంధ్రవారపత్రిక్కి పంపుతూ వేసుకోకపోతే తిప్పి పంపమన్నాను. రాస్తే, అలాగే తిప్పిపంపేసేరు. ఆ తర్వాత 'రైలుప్రయాణం', 'పోరుపడలేక', 'స్వప్నమా సత్యమా'-అనే కథలు రాసేను. 'దౌర్భాగ్యం' అనేకథ చిత్రగుప్తకి పంపిస్తే దానిలో పడ్డాది. 'ప్రేమ ఫలితం' కథ చిత్రగుప్తకి పంపేనని చెప్పేను కదా! అది వాళ్ళపత్రిక ''ప్రజాబంధు''లో పడ్డాది. ఆ తర్వాత ' ఉద్యోగం దొరక్కపోతే' అనే కథ చిత్రగుప్తలో వేసేరు. కథాంజలిలో 'మీరే ఆలోచించండి' కథ పడ్డాది

**మధుర:** మీకేవన్నా రైటర్స్ సెంటిమెంట్లు అని వుండేవా?

**రావి:** మహాభారతం విరాటపర్వం మీద ఒత్తుపెట్టుకొని రాస్తే కథ బాగుంటుందని అలా రాసేవాడ్ని చిన్నప్పుడు.

**మధుర:** రాసుకున్న వాళ్ళకి రాసుకున్నంత కీర్తి రాదు. మీకు కీర్తి ఎప్పుడు పలికింది?

**రావి:** 'అయ్యారే బాబారే' అని ఒక నవల రాసి ఎంతో అనుమానంగా భారతికి పంపేను. భారతి నుంచి వి డి ప్రసాద రావుగారు ఉత్తరం రాసేరు We have been following your stories with quite some interest అని ఆ రోజు పొంగిపోయాన్నేను. ఆ రాత్రల్లా నిద్రపట్టలేదు నాకు కీర్తి వస్తుందని నేను గొప్ప వాడ్నవుతానని ఆ రాత్రే అనిపించింది. ఆ నవలే అల్పజీవి గా 1953 భారతి లో నాలుగునెల్లపాటు వచ్చింది. ఇది అచ్చయాక శ్రీశ్రీ హిందూ రీడింగ్ రూంకి వచ్చి నాగురించి వాకబు చేస్తే, మర్నాడెళ్ళి కలిసేను. రెండు గంటలు మాట్లాడుకున్నాం.

**మధుర:** తెలుగు బాగారాయాలంటే ఏం చేయాలని మీరు అప్పుడు శ్రీశ్రీ గారిని అడిగారట కదా!

**రావి:** అవును. ఇంగ్లీషు బాగా చదవండి - అని శ్రీశ్రీ చెప్పేరు నాకు.

**మధుర:** కన్యాశుల్కం చదివారా?

**రావి:** (నవ్వి) 1957లో 'తిరస్కృతి' రాద్దామని 'కన్యాశుల్కం' చదివేను. దేవతలు తప్ప మనుషులు రాయలేరనిపించింది. దానిలో ఉన్న కష్టం గొప్పతనం అర్థం అయింది.

**మధుర:** మిమ్మల్ని ఎవరు ప్రభావితం చేసేరు?

**రావి:** శ్రీశ్రీ వ్రుగ్రాతలూగిస్తే, గురజాడ నన్ను ప్రభావితం చేశారు. కన్యాశుల్కం చదివేకే నేను మనుష్యులు ఎలా మాట్లాడుతారా అని గమనించాను. కన్యాశుల్కం ప్రభావం నా నాటకాలమీద పెద్దగాలేదు గాని నా కథల మీద వుంది.

**మధుర:** సారాకథలు ఎలా రాశారు?

**రావి:** వాసిరెడ్డి వెంకటప్పయ్య నన్ను బాగా ప్రోత్సహించేడు. కన్యాశుల్కం చదవకపోతే సారాకథలు రాయగలిగే వాడ్ని కాదేమో. సారా కథలు మూడుసార్లు రాసేను. రఫ్ ఫెయిర్ యిలా-

**మధుర:** సారాకథలకి సరైన ప్రోత్సాహం లేక నిరుత్సాహ పడ్డారా?

**రావి:** అవి సంప్రదాయానికి భిన్నం. సారా మీద కథలేవిటి అన్నారంతా. "I was amused and bemused" అని శ్రీశ్రీ ఉత్తరం రాసేరు. తర్వాత ఆయనే పుస్తకంగా వచ్చినపుడు పీఠిక రాసేరు.

**మధుర:** పాశ్చాత్య రచయితలలో ఎవరు మిమ్మల్ని ఎక్కువ ప్రభావితం చేసినది?

**రావి:** డికెన్స్ గొప్ప రైటరు. అతని 'పిక్‌విక్ పేపర్సు' యిప్పటికీ నవ్వు తెప్పిస్తూ వుంటుంది. చెహోవ్ కూడా నాకిష్టం. డికెన్స్‌ను నేను ఆరాధిస్తా. Law is an ass అన్నవాడు నాకు నిజంగా దేవుడే.

**మధుర:** మీరు మీ అంకితాలు దేనికి ఎవంకి యిచ్చారు?

**రావి:** నా అంకితాలు డబ్బుకోసమో మరేదో ప్రయోజనం కోసమో కాకుండా. నా బంధువులకీ నా స్నేహితులకీ యిచ్చేను.

**మధుర:** మిమ్మల్ని కథలు రాయమని ఎవరైనా ప్రోత్సహించారా, పత్రికలవారుగాక?

**రావి:** మా ఆవిడ 'సోదెమ్మ కథలు' రాయండి, చదవాలనుంది - అని కాజువల్‌గా అడిగింది ఒకప్పుడు.

**మధుర:** మీకూ వరదరాజేశ్వరరావుకీ ఏమిటి అనుబంధం?

**రావి:** అతను ఆనాడు నాకు బయట ప్రపంచాన్ని రుచి చూపించాడు నాలోవున్న నేరో థింకింగ్‌ని అంతా వరదే వదిలించేడు. అతను నా మీద చెప్పిన పద్యాలు విన్నావుకదా.

**మధుర:** చలసాని ప్రసాద్ మీ రచనలను కొన్నిటిని గురించి మీది ''పోలీసు వైరి గ్రంథమాల'' అని అన్నాడు. మీరేం టంటారు ?

**రావి:** నేను ఎవరో పాశ్చాత్య రచయిత రాయగా ఎక్కడో చదివేను అతను అవినీతి గురించి చెబుతూ (ఈవిల్) మంచివాళ్ళు కొంతమంది అవినీతిని మొదటసారిగా చూసి అసహ్యించుకుంటారు అని అంటాడు. ఆ తర్వాత కొంతకాలానికి వారికి ఆ అవినీతి ఎడల నిర్లిప్తత ఏర్పడుతుందట. ఆ నిర్లిప్తతలోంచి కొంతకాలానికి అభిమానం చిగురిస్తుందట. ఆ అభిమానం చివరకి ఆ మంచివారు, ఆ అవినీతిని ఆలింగనం చేసుకొందుకి దారితీస్తుందట మన తెలుగులో కూడా ''ఆర్నెల్లు సహవాసం చేస్తే వారు వీరవు తారు'' అనే సామెత వుంది. మంచివాళ్ళు చెడ్డవాళ్ళుగా ఎలా మారుతారో చెప్పడానికే ఈ సామెతని చాలామంది ఉపయోగించగా నేను విన్నాను

**మధుర:** అవినీతి గురించి కాదు, పోలీసుల గురించి నేనడిగేది.

**రావి:** అవినీతితో ఎక్కువ సంబంధం, సహవాసం (స్నేహంకాదు) అవినీతిని అరికట్టవలసిన వాళ్ళకే ఎక్కువ ఏర్పడుతుంది. అందుచేతనే, ఆ పాశ్చాత్య రచయిత చెప్పిన అసహ్యం, నిర్లిప్తత, అభిమానం, ఆలింగనం అవినీతి ఎడల ఏర్పడటానికి - అందుచేతనే, పోలీసుల్లోనే ఎక్కువ అవకాశం వుంటుంది. పోలీసు ఫోర్సులో అందరూ అలాంటి అవినీతిపరులు లేకపోయినా అటువంటివారు ఎక్కువ వుండటానికి అవకాశం అక్కడే వుంది.

**మధుర:** నేనైతే అందుకే పోలీసుల్ని అదుపులో పెట్టుకున్నాను; ఎందుకైనా మంచిదని.

**రావి:** హెడ్డు మనకి గులాం అన్నావుగా. వాళ్ళతో పేకాట ఆడేవు కన్యాశుల్కంలో. ఆమాటకి వస్తే క్రిమినల్ సైడు ప్రాక్టీసు చేసే ప్లీడర్లకి కూడా జీవితంలోని అవినీతితో నిత్య సంబంధం వుంటుంది.

**మధుర:** కొడవటిగంటి కుటుంబరావు గార్ని గురించి మీ అభిప్రాయం?

**రావి:** ఎక్కువగా చదవలేదు కాని ఆయనంటే గౌరవం. మనిషిలో మంచి బేలన్సు వుంది.

**మధుర:** మిమ్మల్ని ప్రభావితం చేసిన రచనలు ఏవి?

**రావి:** పానుగంటి వారి 'సాక్షి' వ్యాసాలు నన్ను బాగా ఆకర్షించాయి చిన్నతనంలో.

**మధుర:** మీరిచ్చే సందేశం ఏమిటి?

**రావి:** సందేశానికేమీలేదు కాని రచయిత ప్రతివాడూ రాస్తున్నది ఏ మంచికి హాని కలిగిస్తుందో, ఏ చెడ్డకి ఉపకారం చేస్తుందో అని ఆలోచించవలసిన అవసరం వుందని నేను తలుస్తాను. మంచికి హాని, చెడ్డకి సహాయం చెయ్యకూడదని నేను భావిస్తాను

**మధుర:** దారిద్ర్యం గురించి మీరేదో చెప్పేరు - ఏంటది ?

**రావి:** దారిద్ర్యం చెడ్డదని చెప్పడానికి అతిసాగు మాటలకోసం పాకులాడక్కర్లేదు. అందులో చాలా సుఖాలున్నాయని చెప్పదలుచుకుంటే మాత్రం చమత్కారాలూ, గారడీలు, మాయలూ వీటన్నిటి కోసం దేవులాడవలసొస్తుంది.

**మధుర:** మీ ఇంట్లో మావిడి చెట్టు ఉండేదా ?

**రావి:** (నవ్వి) మా ఇంట్లో ఓ మావిడి చెట్టు వుండేది. దాని మొదలు మా ఇంట్లోనూ కొమ్మలు బయటా వుండేవి. ఆ చెట్టుకింద ఓ ముసలమ్మ మొక్కజొన్నపొత్తులు, తినుబండారాలు అమ్ముకుని జీవించేది. అక్కడ సిటీబస్సు కోసం కాలేజీ కుర్రాళ్ళు చేరేవారు. అలా చేరిన స్టూడెంట్లు మా యింట్లోని ఆడపిల్లలకు సైట్లుకొడుతూ వుండేవారు. అది చూసి విసుగెత్తి ఒకసారి నేనా చెట్టును కొట్టివేయిద్దామనుకున్నాను. ఇది ఎంత చెడ్డ ఆలోచనో తరువాత తెలిసి ఆ విషయం మీద కథ రాద్దామని రాశాను.

**మధుర:** అరటిచెట్టు లాటి ఆడది అని రాసేరు కదా; అదేమిటి?

**రావి:** అదా - చెప్తా. ఒక కథలో ఒక తల్లి ఒకే బిడ్డను కని చనిపోతుంది. అప్పుడాతల్లి అరటిచెట్టులాటి ఆడది. అరటి చెట్టు ఒకటే గెల వేస్తుంది. గెల వేశాక ఆ చెట్టును కొట్టేస్తారు. ఒక కొడుకు నిచ్చి మరణించిన స్త్రీని గురించి అలా రాశాను.

**మధుర:** మీకు కమ్యూనిజం తీర్థం యిచ్చింది ఎవరు?

**రావి:** మొదట వాసిరెడ్డి వెంకటప్పయ్య; తరువాత ఆకెళ్ళ కృష్ణమూర్తి.

**మధుర:** శ్రీరంగం రాజేశ్వరరావుని మీరు డిస్కవర్ చేశారా?

**రావి:** ఒక కథల పోటీకి మా అమ్మ కథల్ని ఎంపిక చేసింది. అప్పుడు రాజేశ్వరరావుకి బహుమతి వచ్చింది.

**మధుర:** ఆ రోజుల్లో మీకు నచ్చిన యువ రచయితలు ఎవరైనా ఉన్నారా?

**రావి:** శ్రీరంగం రాజేశ్వరరావు, ఎన్. ఎస్.ప్రకాశరావూ. ఇద్దరూ ప్రమాదంలో పోవడం మన దురదృష్టం.

**మధుర:** రఘురామయ్య గారంటే మీ కిష్టమా?

**రావి:** ఆయన శ్రీకృష్ణుడి వేషంలో కర్ణునితో రహస్యంగా ' ఏసతివహ్ని లోన జనియించును' అన్న పద్యంచాలా నెమ్మదిగా అందంగా చదువుతారు. నేనప్పుడు స్టేజిమీద ఆయనకు పాదాభివందనం చేశాను. నాకు తెలుగు పద్యం అంటే ప్రాణం

**మధుర:** మీకు ఇష్టమైన కవి పూర్వీకులలో ఎవరు?

**రావి:** ధూర్జటి. ఆయన కాళహస్తీశ్వర శతకంలో పద్యాలు నాకిష్టం. తెలుగు పద్యం తెలుగువాడి ఆస్తి. తెలుగు పద్యం లాటిది మరెవరికీ లేదు.

**మధుర:** సర్.బి.యన్. శర్మగారు మీకేమవుతారు?

**రావి:** వరసకు నేను వారి మనవడ్ని. గోవులొస్తున్నాయి జాగ్రత్తలో రాజయోగి పెదనాయన వారే.

**మధుర:** మీ రచనల్లో వాడిన విశాఖ మాండలికం చాలా ప్రజాదరణ పొంది బాగా పరిచయమైంది. ప్రజలు యీనాడు అర్థం చేసుకోవడానికి ఏమీ శ్రమ పడనక్కర్లేదనుకుంటా?

**రావి:** కన్యాశుల్కంలో విశాఖ భాష ప్రజలకు పరిచయం అయింది. శ్రీశ్రీ అట్టడుగు వర్గం ప్రజల భాషలో సాహిత్యం రావాలని ఆశించాడు. నేను కొంత వరకు బీద ప్రజల భాష 'సారాకథల్లోనూ' ఇంకా కొన్ని రచనల్లోనూ చేశాను. అట్టడుగు పేద వర్గం ప్రజల భాషలో 'సామ్మలు పోనాయండి' రాశాను. మా వైపు పశువుల్ని సొమ్ములు అని వాడతారు.

**మధుర:** విశాఖ రచయితల సంఘంలోని సభ్యులందరి చేతా నేనెందుకు రాస్తున్నాను అని వ్యాసాలు రాయించారట గదా?

**రావి:** ప్రతి రచయిత తానెందుకు రాస్తున్నాను అనే ప్రశ్నకు జవాబుచెప్పుకోగలగాలి అని

నా ఉద్దేశం. అతను ప్రజల పక్షాన వుంటాడా, వారి శత్రువుల పక్షాన వుంటాడా అనేది ముందు తేల్చుకోవాలని నా అభిప్రాయం.

**మధుర:** మీ పూర్వీకులు ఏ ప్రాంతం నుంచి వచ్చారు?

**రావి:** గురుభట్లు గారని మా పూర్వీకుడు రాచకొండ నుంచి తురపాల వచ్చారట. పూర్వం తుంపాల ఒక బుద్ధిష్టు క్షేత్రం అని విన్నాను.

**మధుర:** మీరు చివరలో అనారోగ్యంతో రాసిన ఇల్లుగురించి చెప్పండి?

**రావి:** కష్టపడి రాశాను. పూర్తిచేశాను. పూర్తిచేయకుండా యిస్తే మళ్ళీ అలాగే మిగిలిపోతుందని కష్టపడి పూర్తిచేశా. ''ఇల్లు'' అంటే ఆస్తులు. అందులో మా వూళ్లో జరుగుతున్న గాంబ్లింగ్ ఆఫ్ ప్రాపర్టీ... భూమి కొనడం, ఫ్లాట్స్ చేయడం, ఇలా రియల్ ఎస్టేట్స్ బిజినెస్ అన్నమాట. దానికోసం ఆడమనుషుల్ని ఎలా మోసం చేస్తారు? ఆస్తులు ఎలా సాధిస్తారు? అన్న అంశాల మీద సాగుతుంది.

**మధుర:** సొమ్ములు పోనాయండి. మూడు కథల బంగారం తరువాత పూర్తి చేసిన నవల ఇల్లు అనుకుంటా. రాజు-మహిషి రత్తాలు-రాంబాబు ఎందుకు పూర్తిచెయ్యలేదు?

**రావి:** చివర్రోజుల్లో ఒంట్లో బాగాలేదు. చదివి స్పిరిట్ ఆఫ్ హిస్టరీ లోకి వెళ్ళాలి. ఇటీజ్ డిఫికల్టు టు గోబాక్ ఎగైన్. అవే కార్క్టర్సు డెవలప్ అవుతాయి. ఈచ్ కార్క్టరినిట్ విల్ హావ్ ఎక్స్ఛేంజింగ్ లాజిక్. ఆ లాజిక్‌కు భిన్నంగా మనం యిష్టంవచ్చినట్లు రాయడం అసహ్యంగా వుంటుంది

**మధుర:** 'ఇల్లు' గురించి చెప్పండి!

**రావి:** మూడు కథల బంగారం కన్నా కొద్దిగా ' ఇల్లు' లో కొంచెం ఉగ్రవాదం కూడా పెట్టా. ' ఇల్లు' లో ఉండే పాత్ర - ఆవిడ రిలేషన్ ఒకడు ఉగ్రవాదిగా ఉంటాడు. వాడ్ని దాదాపు బ్లాక్ మెయిల్ చేస్తారన్నమాట చేసి ఇల్లును కొట్టేస్తారు. ప్రాపర్టీని ఫ్లాట్స్‌గా ఎస్టాబ్లిష్ చేస్తారు. ఆవిడ కాశీ వెళ్లి పోతుంది - అదీ-

**మధుర:** మిర్యాలగూడా గురించి మీ అభిప్రాయం చెప్తారా?

**రావి:** మిర్యాలగూడా ఇప్పుడు మోడ్రన్ ఈస్ట్‌గోదావరి అయిపోయింది డబ్బో అదీ అలా చేస్తుంది. డబ్బు వచ్చింతరువాత ఆ పరిశుభ్రత అంతా పోతుంది. ఒకప్పుడు మా విశాఖ హాయిగా ఉండేది. అందరం స్నేహంగా ఉండేవారం. ఈ పడమటోళ్ళు డబ్బొచ్చింది. దాంతో ఈ వూరిని తగలెట్టేశారు. విశాఖపట్నంలో ఇప్పుడున్న టెంపరేచర్‌కన్నా ఊళ్ళో ఫైవ్ డిగ్రీస్ ఎప్పుడూ తక్కువుండేది.

**మధుర:** మోడ్రనైజేషన్ గురించి మీరేమంటారు?

**రావి:** మోడ్రనైజేషన్ కిల్స్ ది సొసైటీ. మా వాడొకడు అమెరికాలో ఒక ప్లేస్‌నుండి మరోవూరు వెళ్ళినపుడు అన్ని వూళ్ళు ఒకలాగే కనిపిస్తున్నాయి అనేవాడు. చూడండి నల్గొండ వేరు, వరంగల్ వేరుగా వుంటుంది, విశాఖ వేరుగా ఉంటుంది కాని అక్కడ

అన్ని ఒకేలాగ బ్లాక్స్ కట్టిస్తారు. అలాగ ఇక్కడ ఇదో కాంక్రీట్ జంగిల్. ది డేస్ ఆఫ్ ఇన్నొసెన్స్ ఆర్ గాన్. అమాయకపురోజులు పోయాయి. ప్రతి వాడికి డబ్బు కావాలి. ఎంత లంచం పుచ్చుకుంటే అంత గొప్ప.

**మధుర:** నన్ను ఫెమినిజంలో చేరమంటూ కొంతమంది ఆడవాళ్ళు చంపుకు తింటున్నారు. గిరీశంగార్ని అడగాలి ఈ ఫెమినిజం గొడవ ఏంటో....మీరేమంటారు?

**రావి:** అదేం ఫెమినిస్టులో... ఈ ఫెమినిజం ఏమిటండీ? జన విముక్తి జరగాలిగాని స్త్రీ జనవిముక్తి ఒక్కటే కాదు ఎ హోప్‌లెస్‌పుల్ ఆఫ్ సఫరింగ్. .నైన్‌టీపరసెంటు సఫరవుతున్నారు. మిగతా టెన్‌పరసెంట్ సఫరింగ్ లేదు వాళ్ళకు నష్టం ఏమిటి?

**మధుర:** పత్రికలు మీ ఆడ తల్లులకి మంచి ప్రాముఖ్యం యిస్తున్నాయికదా?

**రావి:** 'చేరా' అని, ఒకాయన రాస్తూంటాడు 'వీడు మేల్ ఫెమినిస్టురా' అనేవాడు అబ్బూరి వరదరాజేశ్వరరావు వెటకారంలో వరదని మించిన వాడు లేడు మనిషి మంచివాడు చెట్టుకవి అని ఒకడున్నాడు ఇస్మాయిల్ కాకినాడలో. 'పాపం మనవాడు పొయట్రీలో 'ట్రీ' నీ పట్టుకున్నాడురా' అన్నాడు వెటకారానికి పెట్టింది పేరు. ఠపీమని ఏదైనా అనడం అతని గొప్పతనం.

**మధుర:** మీ ఇంట్లో మరెవరైనా కథలు రాసేవారున్నారా?

**రావి:** మా ఆఖరి వాడు ఉమాకుమారశాస్త్రి అని వాడు కథలు రాస్తున్నాడు ఏదో ఫరవాలేదు. కొన్ని ఉపమానాలు బాగానే రాస్తాడు. నాకన్నా బాగా ఉపమానాలు రాయగలడు నేను చదవను కాళీపట్నం రామారావుగారు చదువుతారు

**మధుర:** మీ ' ఇల్లు' ఎవరికి అంకితమిచ్చారు?

**రావి:** రాచకొండ రామానికి, నా మిత్రుడు హనూరావు కుమార్తె అమెరికాలో విమాన ప్రమాదంలో పోయింది, ఆ పిల్లకు యిచ్చాను అభిమానంతో

**మధుర:** మీరెప్పుడూ చిన్నిల్లు పెద్దిల్లు అంటూ వుండేవారట. చిన్నిల్లు ఎట్లా వచ్చింది?

**రావి:** నేను తటవర్తిరామం అనే ఆవిడని ద్వితీయం చేసుకున్నాను. ఆవిడ నాతో కాపురంచేసింది. మై బోత్ వైవ్స్ ఆర్ గుడ్ కుక్స్. హఠాత్తుగా ఆవిడ కాలధర్మం చెందింది. రాత్రుళ్ళు అక్కడ, ఉదయం పెద్దింట్లో వుండేవాడ్ని. ఆ కథ హఠాత్తుగా ముగిసింది.

**మధుర:** రామంగారి గురంచి కొంచెం వివరిస్తారా?

**రావి:** ది అడ్వాంటేజెస్ అండ్ డిస్ ఎడ్వాంటేజెస్ ఆఫ్ మారీయింగ్ ఎ సెకండ్ వుమన్ రాద్దామనుకున్నా. ఆవిడ డీప్‌లీ రెలీజియస్. భక్తి ఎక్కువ. ఈవిడ లాయరు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కొన్నాళ్ళు చేసింది. సత్యసాయిబాబా భక్తురాలు. దుర్గగుడికి విజయవాడ, వెంకటేశ్వరుణ్ణే చూడటానికి తిరుపతి, సత్యసాయి బాబాగారి కోసం పుట్టపర్తి వెళ్ళి వస్తూండేది. బాగాపాడుతుంది. శ్రీశ్రీ గేయాలు పాడేది.

**మధుర:** హనూరావుగారి గురించి చెప్తారా?

**రావి:** హనూరావు మనదేశంలో పెద్ద స్టేటిస్టీషియన్. అతను విదేశాలకు టూర్‌కి వెళ్ళినప్పుడు కన్యాశుల్కం కాపీ ఒకటి కూడా పట్టుకెళ్ళేవాడు. తరవాత నా రచనలు కూడా చదువుకుందుకు తీసుకెళ్ళేవాడు. మంచి మిత్రుడు.

**మధుర:** ఒక సన్నివేశాన్ని ఉద్వేగభరితం చేయాలంటే తప్పనిసరిగా కవిత్వాన్ని చొప్పించాలా?

**రావి:** నా కథల్లో పదాల ఎంపికా వాటిని వరుసగా కూర్చేపద్ధతీ ఇవన్నీ నేను వచనంలో కవిత్వంకోసం ప్రయత్నిస్తున్నానే భావన కలిగించాయి వాక్యం రసాత్మకం కావ్యం అన్నారు కదా అలాటి నా కవితాత్మక రసాత్మకమైన వాక్యాలు నారచనల్లో పుష్కలంగా ఉంటాయి. వాట్లో కొన్ని ఏరి త్రిపురనేని శ్రీనివాస్ ఓ పుస్తకం వేసేడు

**మధుర:** అలా కథా రచనలో కవిత్వానికి దిగడం ఒకరకంగా రచయిత బలహీనత అని ఆధునిక విమర్శకులంటారు

**రావి:** నా కథల్లో అది నా అదనపు శక్తి! బుచ్చిబాబూ అలారాసేడు కదా.

**మధుర:** సన్నివేశానికి తగినట్లు ఉద్రేకంగా, ఉద్విగ్నంగా చెప్పడం వేరు కవిత్వాన్ని ఆశ్రయించడం వేరు కవిత్వంజోలికి పోకుండా కూడా రాయొచ్చునని కొడవటిగంటి కుటుంబరావు గారి లాంటి రచయితలు నిరూపించారట

**రావి:** కుటుంబరావుది మేటరాఫ్ ఫాక్ట్ నేరేషన్ నాది పొయటికల్ నేరేషను అది నాకలవాటయిన ధోరణి మీకు నచ్చితే చదవండి లేకపోతే మానేయండి

**మధుర:** మీ రచనల్లో సిద్ధాంతాలు వల్లిస్తారా?

**రావి:** నేను నా రచనల్లో సిద్ధాంతాలు వల్లించను. నా ముందు మాటల్లోనేను ఫలానావిధంగా నమ్ముతున్నాను అంటానుగాని మిమ్మల్ని నమ్మమని, నన్నుపాలో అవమని వేధించను నాకు చాలా సోషల్ కన్విక్షన్స్ ఉన్నాయి నా విశ్వాసాలను నేనెప్పుడూ నా రచనల్లో వల్లెవేయను. జీవిత సత్యాలను ఉన్నది ఉన్నట్లు కళా పరిభాషలో చెప్తానంతే.

**మధుర:** 'నిజం' నాటకంలో ఏం చెప్పారు?

**రావి:** ముందుమాటలో చెప్పానే. పేదవాళ్ళని బాగుచెయ్యడానికి పెద్దలెవ్వరూ ఏమీ చేయడం మాత్రం కనిపించడం లేదు. దేముడు చెప్పిన న్యాయాన్ని నిలబెట్టేందుకు మౌల్వీలు, బిషప్‌లు, రోజా ఉపన్యాసాలకు వెళ్తున్నారు. కానీ ఏ పాపం ఎరుగని వారు మాత్రం జెయిళ్ళలోను జెయిళ్ళ బయటకూడా మగ్గుతూనే వున్నారు. పాపంలో పెరిగిన పెద్దవారు ఎన్ని పాపాలు చేసినాసరే పెద్దవారుగానే ప్రభువులుగా ఉంటున్నారు. ఈ పరిస్థితులలో ఈ సంఘంలో పేదవాడికి న్యాయం దొరకదు గాక దొరకదు అన్నానేను.

**మధుర:** ప్రచారానికీ పురస్కారాలకూ వీలయినంత దూరంగా జీవించిన సాహితీపరుడన్నారు మిమ్మల్ని! 'అశ్రు గంగా జలాల్లో అగ్ని సుందరిని సృష్టించిన కథకుడు' అన్నారు అజంతా.

మీరు అటువంటి వారేనా, ఊరకే అలా అంటున్నారా అంతా - అకాడెమీ అవార్డులు యూనివర్సిటీ పురస్కారాలు నిజంగా రాలేదా మీకు!

**రావి:** 'రాచకొండ విశ్వనాథ శాస్త్రి కథలు' అన్నదానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ బహుమతి 1960లో వచ్చింది. అది నా చిన్ననాటి తొలి కథలకి వచ్చిన అవార్డు. తరువాత నేను దేన్నీ స్వీకరించలేదు. నేను గిడుగు రామ్మూర్తి పంతులుగారికి కళాప్రపూర్ణ యివ్వడం నా కళ్ళారా చూసి తరించాను. తర్వాత నాకు అదంటే గొప్ప భయం పట్టుకుంది. వారెక్కడ మనవెక్కడ అనిపించి ఆ బహుమతిని సాలూరి రాజేశ్వరరావుగారికి యిమ్మన్నాను. ఇచ్చేక చాలా ఆనందించాను.

**మధుర:** విజయనగరం వాళ్ళందర్నీ రావప్పపంతుల్లని వెక్కిరించారట మీరు.

**రావి:** అలాంటి వాళ్ళు అక్కడే తారసపడతారు తెలివైనవాళ్ళమని గడుసుగా ప్రవర్తించబోయి తెలివితక్కువగా నటించేవాళ్ళు.

**మధుర:** విశాఖమాండలికం అని, భాష అర్థంకాదని వాదించేవారితో మీరేమంటారు?

**రావి:** నా అభిమాని అత్తలూరి నర్సింహారావు 'రావిశాఖీయం' అని ఒక ప్రతిపదార్థ పదకోశం వేశాడు నా రచనలకి. అది ఒక రకమైన సన్మానం గౌరవం లాంటిది ఏ రచయితకీ బతికుండగా జరగని సత్కారం అది.

**మధుర:** మీకు కలం పేర్లు చాలావున్నాయంటారు నిజమా?

**రావి:** అదో సరదా 'చాటునున్న ఎంకిని సభకు. ' అన్నట్లు నన్ను భారతి వారు 'అల్పజీవి' తో బయట పారేశారు. అంతకుముందు జాస్మిన్, కాంతాకాంత, శంకరగిరి గిరిజాశంకరం, గోల్కొండ రాంప్రసాద్, అంజానా వంటి కలం పేర్లతో రాసేవాడిని.

**మధుర:** దాని వల్ల ప్రయోజనం?

**రావి:** మనం రాసింది మనం ఫలానా అని తెలియక పోతే మన ఎదురుగా మన కథల గురించి ఏమంటారో స్వేచ్ఛగా తెలుసుకోవచ్చు. కలం పేర్ల వల్ల నష్టమేమీ లేదు

**మధుర:** మీ మీదమీకుండే అసహ్యం కొద్దీ కూడాకొంత రచన చేశానన్నారట అవునా?

**రావి:** మనిషి తానెవరో ఎటువంటి వాడో తనకు తెలిసినంతగా మరొకరికి తెలియడానికి అవకాశం లేదు. చదివినా నాకు సంస్కృతం రాలేదు. చదవకపోవడం వల్ల తెలుగువచ్చి ఏదో రాశాను.

**మధుర:** మీరు నటిస్తారా?

**రావి:** 'తిరస్కృతి'లో కొత్తపేట రాజిగాడుగా, 'నిజం'లో ప్రాసిక్యూటర్‌గా ఎన్నోసార్లు నటించాను. కన్యాశుల్కంలో మున్సబు నాయుడుగా ఓసారి నటించేను. నన్ను గురజాడ, పానుగంటి ప్రభావితం చేశారు దృశ్యకావాల్లో.

**మధుర:** 'మెరుపు మెరిసింది' కథ ఎలా ఎప్పుడు రాశారు?

**రావి:** కథ వెనుక కథ అని ఒకసారి ఈ కథ ఎందుకు రాశానో చెప్పడానికి ప్రయత్నించాను 'అనామిక' లో కాబోలు. చాలా మంది యువతులు ముప్పై, ముప్పై ఐదేళ్ళు వచ్చేదాకా అవివాహితలు గానే మిగిలిపోతున్నారు. పెళ్ళి ఒక వ్యాపారంగా మారి యువతుల జీవితాల్లో చిచ్చురేపెడుతున్నది. పెళ్ళికాని మధ్యతరగతి యువతుల్లో మధురోహల్ని, ఆశనిరాశల్ని ఈ కథలో చెప్పానుకుంటున్నాను. ముప్పయి యేళ్ళ క్రితం ఈ కథ రాసినా ఇప్పటి పరిస్థితులు ఇంకా ఘోరంగా వున్నాయి. కట్నం ఇచ్చుకునే శక్తిలేక ఆగిపోతున్న పెళ్ళిళ్ళ సంఖ్య రానురాను పెరిగిపోతోంది.

**మధుర:** 'కార్నరు సీటు' కథ ఎందుకు రాశారు?

**రావి:** చావు చేదనీ, బతుకు తీపనీ, మనిషికి మనిషి ఏమౌతాడో అదీ; తెలియచెప్పడానికి.

**మధుర:** మీ అంతిమ యాత్ర గురించి మీరు ఏదో చెప్తుండేవారట స్నేహితులతో పార్టీల్లో.

**రావి:** అవును. నేను చనిపోతే శారదానదీ తీరంలో దహనం చేయాలనీ. విశాఖపట్నం నుంచి అనకాపల్లి తీసుకెళ్ళి దారిపొడుగునా చచ్చరవాళ్ళ డాన్స్, భజనలు, పాటలు హోరెత్తి పోవాలనీ కోరుకునే వాణ్ణి.

**మధుర:** మీకు ఆటలంటే ఇష్టమా?

**రావి:** నేను స్వయంగా బాగా ఆడినా ఆడకపోయినా - చిన్నప్పట్నించీ నేను ఫుట్‌బాల్ అభిమానిని 1965 నుంచి పోలార్ స్టార్ ఫుట్‌బాల్ క్లబ్‌కు అధ్యక్షుడుగా వ్యవహరించాను

**మధుర:** మీరు లాయరుగా ఎవరి దగ్గర శిక్షణ పొందారు?

**రావి:** మా గురువుగారు తాతా శ్రీరామమూర్తి గారి బార్లో

**మధుర:** మీకు జ్యోతిషంలో నమ్మకం వుందా?

**రావి:** నాకు జ్యోతిషంలోనూ గ్రామదేవతల మీద కూడా నమ్మకం వుంది. మా విశాఖ పట్నంలోని కనకమాలక్ష్మి అంటే నాకు చాలా ఇష్టం

**మధుర:** మీరు ఆరు సారో కథలు, ఆరు సారాకథలు ఆరు నంబరుతో రాయడానికి కారణంయేమిటి?

**రావి:** న్యూమరాలజీ ప్రకారం ఆరు నాలక్కీ నంబరు.

**మధుర:** కొన్నాళ్ళు మీరు విశాఖపట్నంలో లేరు. కారణం?

**రావి:** హరిహర్లో రెండేళ్ళు, మిలటరీ అకౌంట్స్ డిపార్టుమెంట్‌లో పనిచేశాను, ఆనర్స్ అయ్యాక. ఆ వాతావరణం సరిపడక రాజీనామా చేసి క్రిమినల్ లాయర్‌గా తాతా శ్రీరామ్మూర్తిగారి దగ్గర చేరి డెవలప్ అయా.

**మధుర:** మన రచనలు చేరవలసిన వారిని చేరతున్నాయా?

**రావి:** అదే మనదేశంలో పెద్దట్రాజెడీ. ఎవరి గురించి రాస్తున్నామో వారికందదు. బీదప్రజలు మన్నిపాలో కాలేరు. మెస్సేజ్ అక్కర్లేనివారికెళ్తుంది.

**మధుర:** విరసంలోంచి మీరు రాజీనామా చేశారా?

**రావి:** వారి రూల్సుకు నేను తట్టుకోలేకపోయాను. ఎమర్జెన్సీలో జైల్లో వున్నప్పుడు రాజీనామా చేశాను అయినా నేనూ నా రచనలూ ఎప్పుడూ పీడిత ప్రజల పక్షమే.

**మధుర:** పెద్దలు మాట్లాడుకునే భాషలోనే కాక పేదల భాషలో కూడా కవిత్వం ఉంటుందా?

**రావి:** నాచిన్నప్పుడు ఒక వెన్నెలరాత్రి పొలంలో పడుకున్నపుడు మా పాలేరు అన్నాడు ''ఎన్నెలా, నా కన్నతల్లీ, పేదవాడి దీపమా!'' అని. ఇంతకంటే చక్కగా ఎవరనగలరు? ఆశ్చర్యపోయాను ఒకసారి మా ఆఫీసు గేటు వద్ద ఒక బీద పల్లెటూరి ఆడమనిషి నిలబడివుంది. ఆమెను పలకరించాలని బుద్ధిపుట్టి ''అమ్మా! నీ కెవరూలేరా?'' అని అడిగా. దానికి బీదతల్లి ''లేకేమి? పైన ఆకాశం కింద భూమి.. ఆమధ్యన నీ లాటి పెద్దమనుసులూ'' అంది ఇందులో కవిత్వం లేదనగలమా?

**మధుర:** మీరు పాడతారా?

**రావి:** కొన్ని జానపద గేయాల పాడాలనిపించేటంత యిష్టం (నవ్వుతూ) ఓర్రోరి బండివాడా, వగల మారి బండివాడా! ★

*(కళాసాగర్ ఇరవైరెండవ వార్షికోత్సవ సంచిక - 1994)*